




# కరపత్రం

SINCE 2014

గురువారం మే 14, 2026 | సంపుటి : 2 | సంచిక : 212 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

- ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి



హైదరాబాద్,మే 13: హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు.పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు

## ఆ బాలికకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ అండగా ఉంటుంది: మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్, మైనర్(బాలిక)పై లైంగిక వేధింపుల కేసులో నిందితుడి సామాజిక, రాజకీయ నేపథ్యం ఏదైనా సరే.. బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. బాలిక సామాజికవర్గం, పెళ్లికి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న వార్తల్లో నిజానిజాలేవైనా.. అవి ఆయన వ్యక్తిగత అభిప్రాయాలేగానీ.. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి సంబంధం లేదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు.. తదనంతర పరిణామాలపై మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో స్పందించారు. 'మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో కుల ప్రస్తావన తీసుకురావడానికి బండి సంజయ్ ప్రయత్నిస్తుండటం సరికాదు. ఇది పూర్తిగా క్రిమినల్ కేసు. బాలిక కుటుంబాన్ని బెదిరించారనే ఆరోపణలపైనా విచారణ జరుగుతోంది. అవి నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది' అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.



## సిఎం రేవంత్‌ను కలిసిన పలువురు ప్రముఖులు

హైదరాబాద్,మే13 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో పలువురు ప్రముఖులు కలిశారు. వీరంతా సిఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు , రీజనల్ డైరెక్టర్ జె. వి. రాజగోపాల్ రావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్. ఆర్. బాబులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.

## పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు



హైదరాబాద్,మే13 కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (ఠి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

2లో..

## ఫోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

ఇది కుల సమస్య కాదని గుర్తించాలన్న గంగుల



హైదరాబాద్,మే13 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ విషయంలో బీఆర్ఎస్ భాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

» వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్



హైదరాబాద్,మే13 : తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

» బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు

» మంత్రి సీతక్క స్పష్టీకరణ



మహబూబాబాద్,మే13 : భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు.

మిగతాద్ది 2 లో

### పొదుపు సూత్రాలు తెలంగాణకు

## నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్



2లో..

హైదరాబాద్,మే13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## రైతులకు కేంద్రం గుడ్ న్యూస్..

## వరి కనీస మద్దతు ధర రూ. 2వేల 441




కేంద్ర ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. గురువారం (మే13)న ప్రధాని మోదీ అద్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో 2026-27 సంవత్సరానికి గాను ఖరీఫ్ సీజన్ లో14 పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ నిర్ణయించారు. వరి ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర రూ. 2వేల 441 గా నిర్ణయించారు. వరి ఏ గ్రేడ్ కు రూ. 2వేల 461 ధర నిర్ణయించారు. మరోవైపు క్వింటాల్ జొన్నల మీస్రా కూడా పెంచారు. క్వింటాల్ కు కనీస మద్దతు ధర రూ. 4వేల 023 గా ప్రకటించారు. క్వింటాల్ సజ్జలకు కనీస మద్దతు ధర రూ. 2వేల 900 గా ధర ప్రకటించారు. రైతులు పండించిన పంటలకు లాభదాయకమైన ధరలు అందేలా చూసేందుకు, కేంద్ర ప్రభుత్వం 2026-27 మార్కెటింగ్ సీజన్ కోసం ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర (మీస్రా)ను పెంచింది. గత సంవత్సరంతో పోలిస్తే మీస్రాలో అత్యధిక పెంపును పొద్దుతిరుగుడు విత్తనాలకు క్వింటాల్‌కు రూ.622 మద్దతు ధర ప్రకటించింది. ఆ తర్వాత పత్తి క్వింటాల్‌కు రూ. 557, నైజర్ సీడ్ క్వింటాల్‌కు రూ. 515, నువ్వులకు క్వింటాల్‌కు రూ.500 పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

## చికెన్ కిలో ధర రూ.400..!



జోగిపేట(అందోల్): కోడి ధర కొండెక్కింది. ఈ నెల 1న కిలో రూ.259గా ఉన్న ధర ఆదివారం రూ.360కి పెరిగింది. పది రోజుల్లోనే కిలోపై రూ.100 పెరగడం గమనార్హం. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధరల పెరుగుదల అదనపు భారంగా మారుతోంది. వేసవి కావడంతో ఎండలకు కోళ్లు చనిపోతున్నాయని, వాటి బరువు కూడా తగ్గిపోవడం వల్లే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలను చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. ఈ ధరలు మరో 15 నుంచి 20 రోజుల పాటు ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### తగ్గిన ఉత్పత్తి

ఎండలకు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపడం లేదు. అధికంగా కంపెనీల యజమానులే షెడ్లలో కోళ్లను పెంచి, వారు నిర్ణయించిన ధరకే సరఫరా చేస్తున్నారు.

## పొదుపు సూత్రాలు తెలంగాణకు
# నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

మొదటిపేజీ తరువాయి
ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

## ఫోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

మొదటిపేజీ తరువాయి
కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు. కాగా బండి సాయి భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు.. అతడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారని తెలిసిందే. ఇంతకుముందు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో చట్టం, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారి రితిరాజ్‌కు అప్పగించిన నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

మొదటిపేజీ తరువాయి
బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

## చికెన్ కిలో ధర రూ.400..!

మొదటిపేజీ తరువాయి
ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కూడా ఉండటంతో డిమాండ్ పెరగడం, ఉత్పత్తి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమని చెప్పొచ్చు. స్కిన్‌లెస్ కిలో రూ.360కి, లైవ్ కోడి రూ.210, స్కిన్‌తో రూ. 320కి అమ్ముతున్నారు.

**పెళ్లిళ్ల సీజన్‌తో డిమాండ్**
పెళ్లిళ్ల సీజన్‌తో చికెన్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగింది. అంతే కాకుండా ఎండ తీవ్రత కారణంగా కోళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. డిమాండ్ మేర ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగాయి. రెండు వారాల నుంచి కోళ్ల, చికెన్ ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.360కి విక్రయిస్తున్నాం. ధరలు పెరగడంతో కొంతమేరకు విక్రయాలు తగ్గాయి.

## కళ్లాల సౌకర్యం లేక రైతులకు నష్టం
## అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం

**- తక్కువ ధరలకు దళారులకు అమ్ముకునే దుస్థితి**

ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాల సౌకర్యం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. 17 శాతం తేమ ఉండాలనే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు నాలుగు రోజుల పాటు ఎండలో ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. దీంతో, పచ్చి ధాన్యాన్ని దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1,725, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇవ్వాలి. దళారులు కొన్ని ప్రాంతాల్లో 1250 నుంచి రూ.1300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.1,400 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో, బస్తాపై రైతులు రూ.300 నుంచి రూ.400 వరకూ నష్టపోయారు. దళారికి 75 కిలోల బస్తా రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోయారు. 70 శాతం మంది ఈ విధంగానే ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు పక్రియ ప్రారంభించలేదు. తేమ శాతం నిబంధన వంటి కారణాల వల్ల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల బస్తాను రూ.1,400 కే ఇచ్చేయాల్సి వచ్చిందని వాపోయారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దీంతో, మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇందులో ప్రభుత్వం కొన్నది 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ ఏడాది రబీలో ఎకరాకు సుమారు 45 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరిస్తుండడం, మేఘాలు, వర్షాలు భయపెడుతుండడంతో రైతులు గత్యంతరంలేని పరిస్థితుల్లో దళారులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్లో కాకినాడ జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 1.65 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల (21.67 శాతం) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న నేపథ్యంలో వరి కోత, నూర్పిడి పనులను 95 శాతం మేర యంత్రాల ద్వారానే పూర్తి చేస్తున్నారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్
## తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు

**- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె**
**- అనానాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు**
**- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్**



తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్యెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో యూటర్న్

**- విమర్శలు రావడంతో నియామకాన్ని రద్దు చేస్తే ఉత్తర్వులు**

జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివేల్ విషయంలో తమిళనాడు సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. ఆయనను తన ఓఎస్డీగా నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఒక జ్యోతిష్యుడిని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించడం ఏమిటని ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీఎం విజయ్ వెనక్కు తగ్గారు. వెట్రివేల్‌కు గతంలో ఇచ్చిన నియామక ఉత్తర్వులను రద్దు చేసినట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో సీఎం విజయ్ నెగ్గిన విషయం తెలిసిందే. అయితే, విశ్వాస పరీక్షకు ముందు వీసీకే ఎమ్మెల్యే వాణి అర్సు ఓఎస్డీ అంశాన్ని లేవనెత్తారు. శాస్త్రీయత, తార్కిక ఆలోచనా ధోరణితో ముందుకు సాగాలని అన్నారు. మూఢనమ్మకాలను పక్కనపెట్టాలని చెప్పారు. 'మన ప్రభుత్వం జ్యోతిష్యానికి కాక శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాధన్ నియామక ఉత్తర్వులను ఉపసంహరించుకున్నామని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ దగ్గర విజయ్ జ్యోతిష సలహాలు తీసుకుంటుంటారు. ఎన్నికలకు ముందే ఆయన టీవీకే విజయాన్ని ఊహించారు. జయలలిత సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా ఆయన సలహాలు ఇచ్చేవారు. మంగళవారం ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా వెట్రివేల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ విమర్శలపై విజయ్ స్పందిస్తూ.. ఆ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఓఎస్డీ బాధ్యతల నుంచి వెట్రివేల్‌ను తప్పిస్తూ విజయ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బలపరీక్ష అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

**- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు**
**- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్**
**- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని**

కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

## శ్రీవాణి బుకింగ్స్‌లో ఎలాంటి లోపం లేదు
### సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దు: టిటిడి

శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్‌పై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు విజ్ఞప్తి చేసింది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ ఈ విషయంలో పూర్తి స్పష్టతనిచ్చింది. 2019 మే నెలలో ప్రవేశపెట్టిన శ్రీవాణి టికెట్ బుకింగ్ విధానాన్ని మరింత పారదర్శకంగా మార్చేందుకు టీటీడీ నిరంతరం కృషి చేస్తోంది. ముఖ్యంగా 2024 జూన్ నుండి భక్తులకు సురక్షితమైన సేవలు అందించేలా అత్యంత పటిష్టమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం కానీ, ఆ వ్యవస్థలో చొరబడటం కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదు. అయితే, కొందరు దళారులు ఏఐ ఆధారిత ఆటో-ఫిల్లింగ్, ఆటో-కాపీయింగ్ వంటి పద్ధతుల ద్వారా వేగంగా టికెట్లు బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు టీటీడీ గుర్తించింది. ఇలాంటి అనుమానాస్పద కార్యకలాపాలను సాంకేతిక విభాగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అక్రమ బుకింగ్‌లను నిరోధిస్తోంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, ముందు వచ్చిన వారికి ముందు అనే ప్రాతిపదికన పారదర్శక బుకింగ్‌ను టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. భక్తులు కేవలం అధికారిక టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని టీటీడీ కోరింది.

## బీజింగ్ చేరుకున్న ట్రంప్

**- 9 ఏళ్ల తరవాత మళ్లీ చైనా పర్యటన**

మూడు రోజుల పర్యటన కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌కు చేరుకున్నారు. చివరిసారి 2017లో ట్రంప్ చైనా వెళ్లారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ చైనా పర్యటనకు వెళ్లారు. ఇరాన్ యుద్ధం, చైనాతో ట్రేడ్ వార్, తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయం నేపథ్యంలో ఈ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆయా విషయాలపై చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌తో ట్రంప్ చర్చించనున్నట్టు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా చైనా చేరుకున్నారు. ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌తో పాటు చైనా వెళ్లారు. తాను కూడా బీజింగ్ చేరుకున్నట్టు మస్క్ ట్వీట్ చేశారు. అమెరికా అధికారులతో పాటు యాపిల్ సీఈవో టిమ్ కుక్, ఎన్‌విడియాకు చెందిన జెన్సన్ హువాంగ్ వంటి అగ్రశ్రేణి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా చైనాకు వెళ్లినట్టు సమాచారం . చైనాతో అమెరికా టెక్‌కు సంబంధించి పెద్ద ఒప్పందం చేసుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి . ఇదే సమయంలో ఇరాన్ యుద్ధం కూడా ఈ సమావేశానికి ప్రధాన అజెండాగా మారింది. చైనా ప్రభావంతో ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. బీజింగ్ విమానాశ్రయంలో ట్రంప్‌నకు ఘన స్వాగతం లభించింది. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, ట్రంప్‌నకు స్వాగతం పలికారు.

## అత్యధిక మార్కులు సాధించిన బిసి విద్యార్థులకు పురస్కారం

**- నేడు మంత్రి పొన్నం చేతుల మీదుగా అందచేత**

రాష్ట్రంలోని బీసీ గురుకుల, బీసీ హాస్టల్‌లో ఉంటూ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకుఈనెల 14న ప్రతిభా పురస్కారాలు అందిస్తుందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రతిభావంతులైన 508 మంది విద్యార్థులను సన్మానిస్తామన్నారు. పదో తరగతి ఫలితాలలో మహాత్మా జ్యోతిభా ఫూలే నుంచి 147 మంది విద్యార్థులు (576 కటాఫ్), బీసీ హాస్టల్ విద్యార్థులు 67 మంది (550 కటాఫ్) కి మొత్తం 214 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం 137 మంది విద్యార్థులు (988 కటాఫ్/1000), 28 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 165 మంది విద్యార్థులను సత్కరిస్తామని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (467/437/493 కటాఫ్) సాధించిన 107 మంది విద్యార్థులు, 22 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 129 మంది విద్యార్థులను సన్మానిస్తామని ఆయన తెలిపారు.

# బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు

- ఆధునిక వైద్యంతో క్యాన్సర్ రోగులకు కొత్త ఆశలు
- సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ప్రముఖ హెమటాలజిస్ట్ వైద్యులు శ్రీనివాస్ చక్రవర్తి




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మే 13**
రక్త క్యాన్సర్ చికిత్స రంగంలో ఆధునిక సాంకేతికతలు, అత్యాధునిక వైద్య పద్ధతులు విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నాయని ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి తెలిపారు. కరీంనగర్ యశోద ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం బ్లడ్ క్యాన్సర్ చికిత్స మరింత ఖచ్చితంగా,సమర్థవంతంగా మారిందన్నారు.బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ప్రస్తుతం టార్గెటెడ్ మెడిసిన్స్,ఇమ్యూనో థెరపీ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ ఆధునిక చికిత్సల వల్ల ఆరోగ్యకరమైన కణాలకు నష్టం కలగకుండా కేవలం క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని చికిత్స అందించడం సాధ్యమవుతోందన్నారు.
ప్రెసిషన్ థెరపీ ద్వారా రోగి పరిస్థితిని బట్టి ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని, దీనివల్ల చికిత్స ఫలితాలు మరింత మెరుగుపడుతున్నాయని చెప్పారు. కార్-టి సెల్ థెరపీ ను లివింగ్ డ్రగ్ గా అభివర్ణిస్తూ, రోగి స్వంత కణాలను శిక్షణ ఇచ్చి క్యాన్సర్ కణాలపై పోరాడే విధంగా మార్చడం ఈ విధానంలోని ప్రత్యేకత అని తెలిపారు. ఈ థెరపీ ద్వారా కొన్ని క్లిష్టమైన రక్త క్యాన్సర్ కేసుల్లో కూడా ఆశాజనక ఫలితాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.
ఆధునిక బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ పద్ధతుల వల్ల రోగులు ఎక్కువకాలం మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించే అవకాశాలు పెరిగాయని ఆయన అన్నారు. గతంలో అందుబాటులో లేని పలు అధునాతన చికిత్సలు ఇప్పుడు భారతదేశంలో కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి వస్తుండటం వైద్య రంగంలో సానుకూల పరిణామమని డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

# పీవీ స్మృతి వనం పనులు తొందరగా పూర్తి చేయాలి, వంగరలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి- మంత్రి పొన్నం ప్రభాకర్

**కరపత్రం ప్రతినిధి- భీమదేవరపల్లి :**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగ్రామం వంగరలో ఏర్పాటు చేస్తున్న పీవీ స్మృతి వనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బీసీ సంక్షేమం, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వంగరలో ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి పనులను ఆయన బుధవారం పర్యవేక్షించారు. వచ్చే జూన్ నెలలో జరగబోయే పీవీ జయంతి లోపు శృతి వనం, విజ్ఞాన కేంద్రం లతోపాటు అన్ని పనులను పూర్తి చేయించాలన్నారు. నవోదయ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు ఐకెపి కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు విధానాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందిలో జరగకుండా అధికారులు చూడాలన్నారు .అనంతరం భీమదేవరపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అడిషనల్ కలెక్టర్ రవి, డీఈఓ గిరి రాజు గౌడ్, ఆర్డీవో రమేష్ రాథోడ్, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అన్న దాతలను విస్మరిస్తే మూల్యం చెల్లించక తప్పదు.

- ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- డిమాండ్ల సాధనకు కరీంనగర్ లో ఈనెల 30 న రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన సమర భేరి.
- పోలాడి రామారావు



**కరపత్రం ప్రతినిధి-కరీంనగర్:**
అన్నధాతలనునిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించక తప్పదని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పాలకులను హెచ్చరించారు. రాష్ట్రం లో మొక్కజొన్న, వరి దాన్యం కొనుగోళ్లు, తరలింపు ప్రక్రియ లో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని రైతు ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కొనుగోళ్లు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా నేటికీ నత్త నడకన సాగుతోందని విమర్శించారు.మద్దతు ధర తో పాటు ప్రభుత్వం ప్రకటించిన 500 రూ. బోనస్ ను అడిగితే రక రకాల కొర్రీలు పెడుతున్నారని, క్కనుగోళ్లలో పాలకులు నిర్లక్షంగా వ్యవహరిస్తూ కమీషన్లకు కక్కుర్తి పడి ప్రైవేట్ వ్యక్తులకు మేలు చేసేందుకే పాలకులు ఇదంతా చేస్తున్నారని పోలాడి ఆరోపించారు. అధికారులు మిల్లర్లు కుమ్మక్కై తేమ, తాలు పేరుతో క్వింటాల్ కు 6 నుండి 8 కిలోలు కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు దాన్యాన్ని ఎండబెట్టే క్రమంలో తీవ్రమైన ఎండల తో రైతులు మృత్యువాత పడటం కలచి వేసిందన్నారు. రైతుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ డిమాండ్ల సాధనకు రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో
ఈనెల 30 న కరీంనగర్ లో భారీ ఎత్తున నిర్వహించే రైతు మహాగర్జన సమరభేరి సభ విజయవంతానికి కరీంనగర్ పట్టణంలో నాయకులతో కలిసి పోలాడి రామారావు విస్తృతంగా పర్యటిస్తూ వివిధ రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టారు ఇందులొ భాగంగా బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పోల్సాని సుగుణాకర్ రావు,పెద్దపల్లి మాజీ శాసన సభ్యుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి లను బుధవారం కరీంనగర్ లో వారి వారి నివాసంలో రైతు మహాగర్జనకు సభకు ఆహ్వానిస్తూ పోలాడి రామారావు నాయకుల తో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేయగా అందుకు వారు సానికూలంగా స్పందించి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించి రామారావు తో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పత్తి వాసుదేవ రెడ్డిని,సిపిఐ జిల్లా కార్యాలయం లో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు జీ వీ రామకృష్ణా రావు,మాజీ మేయర్ ప్రస్తుత డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ మేయర్లు రవీందర్ సింగ్, డి. శంకర్ లను కలిసి రైతు మహాగర్జన సభ ఆహ్వాన పత్రికలను అందజేసి గోడ ప్రతులను వారిచే రామారావు ఆవిష్కరింపజేశారు.
తాము సంపూర్ణంగా రైతుల మహాగర్జన సమర భేరి సభకు తమ పార్టీల తరపున మద్దతు పలుకుతూ పెద్ద ఎత్తున రైతుల తో కలిసి సమావేశానికి తరలి వస్తామని వారు ప్రకటించడం పట్ల ప్రజా సంఘాల తరపున రామారావు కృతజ్ఞతలు తెలిపారు. అన్న దాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. కరీంనగర్ లో భారీ ఎత్తున నిర్వహించే రైతుల మహాగర్జన సమర భేరి సభ కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే 20 వేల మంది మహిళలను రైతులను తరలుస్తున్నామని రామారావు తెలిపారు.

# దాతలు సహాయం అందించండి..

- 8 నెలల పాపకు పునర్జన్మ ఇద్దాం..

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 13:**



బుడిబుడి అడుగులతో ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్న చిన్నారి వేదశ్రీని ఓ మాయదారి రోగం ఇబ్బంది పెడుతుంది. పెద్దపల్లి జిల్లా రామగుండం అయోధ్య నగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ వీరిశెట్టి శేఖర్ - భవాని దంపతుల కుమార్తె 8 నెలల పాప వేదశ్రీకి మెదడుకు ఆక్సిజన్ అందక న్యూరో ప్రాబ్లమ్ తో బాధపడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. గత నెల 23న, చిన్నారి వేదశ్రీకి ఫిట్స్ రావడంతో కరీంనగర్ హాస్పిటల్ కి తీసుకోనివెళ్లగా మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ కొండాపూర్ లోని కిమ్స్ హాస్పిటల్ లో చిన్నారిని అడ్మిట్ చేసి వైద్య సేవ అందిస్తున్నారు. గత 30 రోజులుగా హాస్పిటల్ ఉంటూ వైద్య సేవలు పొందుతున్న చిన్నారికి వైద్య ఖర్చులకోసం రూ.30 లక్షల ఖర్చు అవుతాయని వైద్యులు తెలుపగా వైద్య ఖర్చులకోసం చిన్నారి కుటుంబ సభ్యులు దాతల సహకారం కోరుతున్నారు. దాతలు ఎవరైనా ఉంటే చిన్నరి వైద్య సహాయం కోసం సహాయం అందించాలని. వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ దాతలను కోరారు. సహాయం అందించే దాతలు 9963142880 నంబర్ కు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా సహాయం అందించాలని తెలిపారు. మనం చేసే ఈ సహాయం చిన్నారి జీవితానికి వెలుగు ఇచ్చిన వాళ్ళం అవుతామని సురభి శ్రీధర్ అన్నారు. దాతలు స్పందించాలని చిన్నారికి పునర్జన్మను ఇవ్వాలని దాతలు సురభి శ్రీధర్ కోరారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా..
# జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ కార్యాలయ ప్రారంభం







జమ్మికుంట పట్టణ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా సేవలందించాలనే లక్ష్యంతో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ నూతన కార్యాలయాన్ని స్థానిక శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 13**
జమ్మికుంట పట్టణంలోని 23వ వార్డు పాత వ్యవసాయ మార్కెట్ సమీపంలో పద్మశాలి భవనం పక్కన ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి సమస్యలను వేగవంతంగా పరిష్కరించే దిశగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యాలయం కీలక కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ సమస్యలను నేరుగా తెలియజేసే వేదికగా ఇది పనిచేస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు కోలుగురి సురేష్, పొనగంటి రాము, చుంచు రమాదేవి, మైస రవి, ఒగ్గు రమేష్, బండ శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ పోనగంటి సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం జమ్మికుంట ఆస్థాన వేదపండితులు బ్రహ్మశ్రీ మండలేముల కపర్ధి శర్మ వేద ఆశీర్వచనాలు అందించి కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# బండ పోసానిపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో పాల్గొన్న జయ శంకరవిశ్వవిద్యాలయంప్రొఫెసర్ వ్యవసాయ శాఖ అధికారి డి ఎ రామాంజనేయులు

**కరపత్రం ప్రతినిధిదవెల్దుర్తి మాసాయిపేట మే 13**




మెదక్ మండలం, బండపోసాన్ పల్లి గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డా ఏ వి రామాంజనేయులు ( ప్రధాన శాస్త్రవేత్త) మాట్లాడుతూ డ్రిప్ తుంపర సేద్యం ద్వారా నీటిని ఇచ్చేటప్పుడు ఆయా పంటల లో సిఫారసు చేసిన మోతాదు సమయం ప్రకారమే వినియోగించాలని సూచించారు. నేల, నీరు వాతావరణ కాలుష్యం తగ్గించడానికి, నేల సారం పెంచడానికి, హరిత వాయు ఉద్గాలు తగ్గించడానికి వివిధ పంటలలో, ఉద్యాన వన తోటలలో, అటవీ వ్యవసాయ విధానం లో సేంద్రియ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు. అడవి పందుల కోతుల నుండి పంటలను కాపాడడానికి సోలార్ ఫెన్సింగ్, ఆత్రనాథ యంత్రాలను వినియోగించాలని తెలియచేసారు. పంటలలో అధిక యూరియా వినియోగం తగ్గించాలని, దానికి ప్రత్యామ్నాయంగా పచ్చి ఆకు ఎరువులు, కోళ్ల, పశువుల మరియు గొర్రెల ఎరువులు, వాన పాముల ఎరువులు వాడినట్లయితే సిఫారసు చేసిన నత్రజని లో 25 నుంచి 50 శాతం వరకు తగ్గించవచ్చు అని డా ప్రేమ్ పేర్కొన్నారు. అలాగే తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే రసాయనాలు వాడాలని పంట మార్పిడి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. ఉత్తమ్ కుమార్ , బండపోసాన్ పల్లి గ్రామ సర్పంచ్ టి. మంజుల-నరేందర్ రెడ్డి మరియు అధిక సంఖ్య లో బండపోసాన్ పల్లి రామాయపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన..

బండి సాయి భగీరథ్ ను అరెస్టు చేయాలి
- క్యాబినెట్ నుండి మంత్రి బండి సంజయ్ ను బర్త్ రఫ్ చేయాలి
- పట్టణ చౌరస్తాలో ఆందోళన చేపట్టిన గులాబీ నేతలు
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 13:**
మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఉన్మాది బండి సాయి భగీరథ్ ను వెంటనే పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గోదావరిఖని పట్టణ చౌరస్తా వద్ద గులాబీ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సాయి భగీరథ్ చిత్ర పటానికి చెప్పుల దండ వేసి చెప్పులతో కొట్టారు. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ చిత్రపటంపై షేమ్ షేమ్ అంటూ గీతలు గీశారు. ఈ సందర్భంగా పోలీసులకు పార్టీ శ్రేణులకు మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి బండి సాయి భగీరథ్ చేస్తున్న అకృత్యాలను బండి సంజయ్ తన పదవిని ఉపయోగించుకొని కాపాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా అదే బాలిక కుటుంబం పై హాని ట్రాప్ ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రధానమంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లొంగిపోయాడని, దీంతో సాయి భగీరథ్ ను సిట్ విచారణ పేరుతో బెయిల్ కు ఇచ్చేందుకు అవకాశం ఇస్తున్నారని పేర్కొన్నారు. కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. భగీరథకు అరెస్టు చేసి రాష్ట్రంలో ఉన్న మహిళలకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ తస్లీమా భాను, పర్స స్వాతి, జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూర్ల వంశీకృష్ణ, బొట్ల పోచం, కృష్ణస్వామి, కొండ సురేష్, పోయిల రవి, ఉదయ్, శైలజ, కుమారి, రజిత, ఇంద్ర, భాగ్యలక్ష్మి, సరోజన, ధరణి అనసూయ, అశ్విని ఉన్నారు.

# నవ దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి ప్రతినిధి:**



సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణ సమీపం లోని ఎం ఎం కన్సిలేషన్ లో జరిగిన వివాహ మహోత్సవానికి చంటి క్రాంతి కిరణ్ హాజరయ్యారు. అందోల్ మండలం గ్రామానికి చెందిన నాయికోటి భారతమ్మ, బాగయ్య దంపతుల కనిష్ట పుత్రుడు రమేష్ వివాహం.. జోగిపేట పట్టణ వాస్తవ్యులైన కొత్త శ్రీనివాస్, లక్ష్మీ దంపుతుల కూతురైన శైలజతో వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహానికి అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం మే 14, 2026

## యశ్వంత రావు పేట లో నర్సరీని తనిఖీలు నిర్వహించిన ఏపీవో రాజు



కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 13

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావు పేట గ్రామంలో నీ నర్సరీనిబుధవారం నాడు ఏపీవో రాజు తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం నాడు యశ్వంతరావు పేట గ్రామంలోని నర్సరీని తనిఖీలు నిర్వహించడం జరిగిందని అందులో ఉన్నటువంటి నర్సరీ కానుగు జామ సీతాఫలం వెదురు వెలగా బురుగు మందార గులాబీ రెంట్రీ పోరక అల్లనేరడి తదితర చెట్లను పెంచడం జరుగుతుందని వీటికి నిత్యం నీరును అందించడంలో గ్రామ కార్యదర్శి గ్రామ సర్పంచ్ నర్సరీ వీధులను నిర్మిస్తున్న వారు నిత్యం మొక్కలకు నీటిని పట్టడం జరుగుతుందని ముఖ్యంగా నర్సరీ మొక్కల వలన వాతావరణ కాలుష్యాన్ని మొక్కలు పీల్చుకొని మనకు సుగంధమైనటువంటి వాతావరణాన్ని అందించడం కోసమే నర్సరీ మొక్కలను పెంచడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తొలి దిశ నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రవేశపెట్టినటువంటి అద్భుతమైన పథకాలలో ఈ నర్సరీ పెంచడం కోసం ఎంతో ప్రాధాతలను ఇస్తూ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీ మొక్కలను పెంచడంతో వాతావరణంలో కాలుష్యాన్ని నిర్మూలించుకోవడం సులబుగా ఉంటుందని వారు తెలియజేశారు వెల్దుర్తి మండలంలోని ప్రతి గ్రామంలో నర్సరీ నిర్వాహకులు సమయం పాలన పాటిస్తూ నర్సరీ మొక్కలకు నీటిని పట్టిస్తే అవి ఏపుగా ఎదిగి మనకు సుగంధమైనటువంటి వాతావరణన్ని వెదజల్లుతుందని మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు అందరూ కలిసికట్టుగా ఉండి మొక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా మొదలు పెడితే గ్రామంలోని మొక్కలు నాటే కార్యక్రమం చేపడితే గ్రామంలోని కాలుష్యాన్ని కూడా నిర్మూలన అరికట్టే విధంగా ఉంటుందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో యశ్వంతరావు పేట గ్రామ సర్పంచ్ మల్లేష్ గౌడ్ ఉప సర్పంచ్ బాబు గ్రామ కార్యదర్శి నవీన్ రెడ్డి లు పాల్గొన్నారు

## అమూల్ పాలధరలు పెంపు
## లీటర్‌కు రెండు రూపాయలు పెంచిన సంస్థ

- నేటినుంచే పెంచిన ధరలు అమల్లోకి
- అదే బాటలో మదర్ డెయిరీ కూడా పెంపు

అమూల్ బ్రాండ్‌పై పాల ఉత్పత్తులు విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ పాల ధరలను పెంచింది. లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మే 14 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ / ట్రిమ్, టీ-స్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. గతేడాది మే 1న చివరి సారిగా ధరలు సవరించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. పశవుల దాణా, ప్యాకేజింగ్ ఖర్చులు, చమురు ధరలు పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. పాల రకాన్ని బట్టి లీటరుకు 2.5 నుంచి 3.5 శాతం మేర ధరలు పెరుగుతున్నాయని, ఆహార పదార్థాల ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఈ పెంపు తక్కువేనని పేర్కొంది.

మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. మే 14 నుంచి పెరిగిన పాల ధరలు అమల్లోకి రానున్నాయని తెలిపింది. పాల ధరలను అమూల్, మదర్ డెయిరీ పెంచిన నేపథ్యంలో ఇతర కంపెనీలూ ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది.

## పెళ్లి వాహనం బోల్తా బాలుడు దుర్మరణం

మహబూబ్‌నగర్ జిల్లాలో పెళ్లి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 19 మందికి గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్ గ్రామానికి చెందిన 20 మంది బొలెరో వాహనంలో భూత్పూర్ మండలంలో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం తిరిగి తమ గ్రామానికి వెళ్తున్న క్రమంలో మహబూబ్‌నగర్‌లోని కొత్త కలెక్టరేట్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలుడు సాయి వర్షిత్ (6) అక్కడికక్కడే మృతిచెందగా.. మిగతా వారికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## జ్ఞానాపురం కూరగాయల మార్కెట్ విస్తరణ
## విశాఖ ఎంపి శ్రీభరత్ వెల్లడి

విశాఖ నగరానికి కీలక వాణిజ్య కేంద్రంగా ఉన్న జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. బుధవారం జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో పర్యటించిన ఆయన.. అక్కడ దైనందిన కార్యకలాపాలను పరిశీలించారు. వర్తకులు, కార్మికులు, రైతు ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్లో వ్యాపార కార్యకలాపాలు భారీ స్థాయిలో జరుగుతున్నప్పటికీ పార్కింగ్, లోడింగ్, అన్‌లోడింగ్, రహదారులు, నిల్వ సదుపాయాలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ అత్యవసరమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వ్యాపార పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరింత సౌకర్యవంతమైన హోల్‌సేల్ మార్కెట్ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం హైవేలకు అనుసంధానం ఉండే ప్రదేశంలో సమగ్ర మార్కెట్ యార్డును అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడి వర్తకులు, వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని ఎంపీ తెలిపారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావుకు ఘన జన్మదిన వేడుకలు

- కార్యకర్తలకు అండగా నిలిచే నాయకుడు --సంపత్ రావు





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 13

బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు జన్మదిన వేడుకలు జమ్మికుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జమ్మికుంట పట్టణంలోని శివాలయం (బొమ్మల గుడి)లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్థానిక గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి ఉత్సాహభరిత వాతావరణంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు జీడీ మల్లేష్ మాట్లాడుతూ ఎర్రబెల్లి సంపత్ రావు విద్యార్థి దశలోనే సామాజిక చైతన్యంతో ముందుకు వచ్చి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ద్వారా విద్యార్థి సమస్యలపై ఉద్యమించారని గుర్తుచేశారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ జాతీయ భావజాలంతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. బీజేపీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సంపత్ రావు జమ్మికుంట మండల బీజేవైఎం అధ్యక్షుడిగా, బీజేపీ మండల అధ్యక్షుడిగా పార్టీ పటిష్టతకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలందిస్తూ యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షించారని తెలిపారు.

వారి క్రమశిక్షణ, కృషి, పట్టుదల, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించిన పార్టీ నాయకత్వం గతంలో జిల్లా కార్యదర్శిగా, ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిందని మల్లేష్ తెలిపారు. అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతానికి సంపత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొంటూ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్న నాయకుడు సంపత్ రావు అని ఆయన అభివర్ణించారు. రాబోయే రోజుల్లో ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ అధ్యక్షులు జీడీ మల్లేష్, పల్లపు రవి, కొమ్మ అశోక్, మేక సుధాకర్ రెడ్డి, కొండ్లె నాగేష్, తూడి రవిచంద్ర రెడ్డి, ఉడుగల మహేందర్, కొండపర్తి ప్రవీణ్, పోడేటి అనిల్, మురికి మహేష్, యాంసాని సమ్మయ్య, అప్పల రవీందర్, ఎర్ర వెంకటేష్, బొజ్జ శరత్, లకిడి రాజు, గడ్డం శ్రీ వర్ధన్, పల్లబోయిన పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## యశ్వంతరావు పేట గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ టి ప్రభాకర్ రెడ్డి డాక్టర్ విజయలక్ష్మి

- గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారిని చంద్ర వేణి
- గ్రామ సర్పంచ్ మల్లేష్ గౌడ్





కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 13

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావు పేట గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖకు సంబంధించినటువంటి కార్యక్రమంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ టి ప్రభాకర్ రెడ్డి ప్రొఫెసర్ మాట్లాడుతూ వానాకాలం యాసంగి పంట కాలంలో వరి పంట నాట్లు ఆలస్యంగా వేయడం వలన మే నెలలో కూడా పంట కోసే పరిస్థితులు కనిపిస్తున్నాయని దీనిని దృష్టిలో పెట్టుకొని రాబోయే వర్షాకాలంలో నీరు అందుబాటులో ఉండే జూన్ నెలలోనే నాట్లు వేసుకొని నవంబర్ వానాకాలం పంట పోసుకుని మరల డిసెంబర్ నెలలోనే యసంగి పంట నాటినట్లయితే మార్చి చివరి వరకు రెండు పంటలను ముగించుకొని ఏప్రిల్ మే నెలలో భూమిని దున్నుకొని బాగా ఆరే విధంగా చూసుకోవాలని వరి పంట కాలాన్ని ముందుకు జరిపినట్లైతే పండించిన వరి పంట వడ్ల లో నూక శాతాన్ని తగ్గించుకోవచ్చునని మంచి ధర వస్తుందని వారు తెలియజేశారు రైతుల కోసం ప్రత్యేకంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు ఈ కార్యక్రమం ద్వారా రైతుల కు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖలో అనుభవం ఉన్న అధికారులను నియమించి రైతులు అందిస్తున్నటువంటి పంటల వివరాలను తెలిపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇలాంటి అరుదైన అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలి ప్రస్తుత పరిపాలన రైతుల కోసమే ప్రాధాన్యత ఇస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని అలాంటి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటే రానున్న రోజుల్లో రైతులు ఎంతో అభివృద్ధి చెందే దిశగాన్ని ప్రయాణించడం తధ్యమని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారిని చంద్ర వేణి యశ్వంతరావు పేట గ్రామ సర్పంచ్ మల్లేష్ గౌడ్ ఉప సర్పంచ్ బాబు గ్రామ రైతులు ప్రజలు పాల్గొన్నారు

## మక్కా రైతుల సమస్యలపై జమ్మికుంట మార్కెట్‌లోనే గర్జించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

- "రెండు రోజుల్లో మక్కల బస్తాలు తరలించకపోతే రైతులతో కలిసి మార్కెట్‌లోనే పడుకుంటా"





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 13

జమ్మికుంట పత్తి మార్కెట్‌లోని మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి రైతుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో వేలాది మక్కల బస్తాలు పేరుకుపోవడం, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడం, అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మక్కా రైతులు తమ పంటను అమ్ముకోలేక రోజుల తరబడి మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో సుమారు 40 వేల మక్కల బస్తాలు పేరుకుపోయి ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ...

"రెండు రోజుల్లో ఈ మక్కల బస్తాలను తరలించకపోతే రైతులతో కలిసి మార్కెట్ యార్డులోనే పడుకుంటా... రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను" అంటూ హెచ్చరించారు. మక్కల తరలింపులో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు రావడం దురదృష్టకరమని ఆయన అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హమాలీల కొరత కారణంగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు పూర్తిగా దెబ్బతిన్నాయని మార్కెట్ సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా అదనపు హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మార్కెట్ పాలకవర్గం, ఆర్డీఓ, మార్క్‌ఫెడ్ డీఎం అధికారులు, మార్కెట్ సిబ్బంది మరియు రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై సమీక్షించారు. కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. మక్కల తరలింపులో మరింత జాప్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ఎమ్మెల్యే, రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా ఎల్లప్పుడూ పోరాడుతానని హామీ ఇచ్చారు.

"రైతు కష్టానికి అండగా... రైతు హక్కుకు భరోసాగా..."మార్కెట్‌లో రైతుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు --- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

## ఎపిలో డిజిటల్ కనెక్టివిటీ పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భారత్ నెట్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. భారత్‌నెట్ ఒప్పందంతో రాష్ట్రంలో డిజిటల్ విప్లవానికి మరింత వేగం రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అసమానతలను తగ్గించడం, ప్రజలకు సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం వంటి లక్ష్యాలకు ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది. డిజిటల్ ఇండియా లక్ష్యాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 'సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రామ్' అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులు డిజిటల్ భారత్ నిధి ద్వారా విడుదల కానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు వేగవంతం కావడంతో పాటు టెలికాం మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి. కొత్త ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని 13,426 గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించనున్నారు. ఫైబర్ నెట్ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సులభంగా చేరేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న 3,942 గ్రామాలకు 'ఆన్-డిమాండ్ కనెక్టివిటీ' సౌకర్యం కల్పించనున్నారు. ఇప్పటివరకు సరైన నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలను వినియోగించ నున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు మరింత వేగంగా విస్తరించే అవకాశం ఏర్పడింది. ఈ ప్రాజెక్టు అమల్లో కేంద్ర టెలికాం శాఖ, బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌బ్యాండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక భాగస్వామ్య సంస్థలుగా వ్యవహరించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన డిజిటల్ సేవలను అందించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యంగా ఉంది. భారత్‌నెట్ ప్రాజెక్టు అమలుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ విద్యా సేవలు మరింత విస్తరించనున్నాయి. విద్యార్థులు డిజిటల్ క్లాసులు, ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ లెర్నింగ్ సదుపాయాలను సులభంగా వినియోగించుకోగలరు.